# బలహీనుడు

గోపాలం కాలువ గట్టున కూర్చున్నాడు. అతను కూర్చున్నచోట యిసుక ఉంది. అది తెల్లగా మెరుస్తోంది. ఆ మధ్య అతను ఉన్నాడు. అందుచేత అతను కనుపిస్తున్నాడు. చీకటైనా కనుపిస్తూనే ఉన్నాడు. పైన నక్షత్రాలున్నాయి. ఉన్నట్టుగా మినుకుమినుకుమంటున్నాయి. అవి వెలుతుర్నిస్తాయి. కాని యిస్తున్నట్టు కనుపించవు. ఆ వెలుతురు భూమి మీద పడుతుంది. కొండలమీద పడుతుంది. చెట్లమీద పడుతుంది. నీళ్ళల్లో పడుతుంది. అన్నిటిమీదా పడుతుంది. కాని ఏవీ కనిపించవు. అన్నీ చీకటిలో దాగిఉంటాయి. అవి దాగి ఉన్నచోట చీకటి ఉంటుంది. చీకటి ఉన్నచోట వెలుతురు ఉండదు. కాని వెలుతురు ఉన్నచోట చీకటి ఉంటుంది. అందుకే నక్షత్రాలు ఉన్నా చీకటి ఉంది.

గోపాలం నీళ్ళల్లోకి చూస్తున్నాడు. నీళ్లు అతనికి కనుపించడం లేదు. అక్కడ చీకటి ఉంది. ఆ చీకటిని అతను చూస్తున్నాడు. అది నల్లగా కనుపించింది. చీకటి నల్లగా ఉంటుందనుకున్నాడు. అగ్గిపుల్ల వెలిగించాడు. చీకటి కనుపించలేదు. ఇసుకలో యినుప మేకు కనుపించింది. నల్లగా ఉంది. వెలుతురు ఉన్నా అది నల్లగా కనుపించింది. వెలుతుర్లో

చీకటి కనుపించలేదు. ఉంటే అది నల్లగా కనుపించి ఉండాలి. లేదుగనుక చీకటి నలుపుకాదు. మరి చీకటి ఏ రంగో అతనికి తెలీదు. తెలీనిదాన్ని గురించి అతను ఆలోచించడు. అందుకని ఆలోచించడం మానివేశాడు.

అతను పూర్తిగా ఆలోచించడం మానివేయలేదు. తెలీని విషయాన్ని ఆలోచించడం మానివేసాడు. కాని తెలిసిన విషయాన్ని గురించి ఆలోచిస్తున్నాడు. తనకు ఎందుకు మనశ్శాంతిలేదో అతనికి తెలుసు. తెలుసు గనుక ఆ విషయం ఆలోచిస్తున్నాడు.

అంతా అతన్ని మంచి వాడనుకొంటున్నారు. అంటున్నారు. కాడని ఎవరూ అనడంలేదు. అనుకోవడంలేదు. అలా అనుకుంటే బావుండును. అతనికి మనశ్శాంతి ఉండేది.

అతను చెడ్డపనులు చేశాడు. చేసినట్టు ఎవరికీ తెలీదు. తెలీదని ఎవరూ తెలుసుకోడానికి ప్రయత్నించలేదు. అందుకు ఒక కారణం ఉంది. అతను ఆ వూరు వచ్చిన రోజునే ఒక మంచిపని చేశాడు. అతను దిగిన యింటి ప్రక్కనే ఒక యిల్లు ఉంది. ఆ యింట్లో ఒక అమ్మాయి ఉంది. ఆమెకు అకస్మాత్తుగా ఆ రోజే జబ్బుచేసింది. ఆ యింట్లోవాళ్లు చాలా కంగారుపడ్డారు. డాక్టరుకు చూపించడానికి డబ్బులేదు. గోపాలం ఆసంగతి విన్నాడు. డాక్టరును తీసుకొచ్చాడు. తనే డబ్బిచ్చాడు. వారం రోజుల తర్వాత ఆ అమ్మాయి తేరుకొంది. ఈలోగా ఆమె భర్త వచ్చాడు. ఆమె బాగోగుల్ని చూసుకున్నాడు. గోపాలాన్ని మెచ్చుకున్నాడు.

ఆ విషయం కొద్దిమందికి తెలిసింది. ఆ కొద్దిమందీ వెళ్ళి చాలా మందికి చెప్పారు. చాలామంది వెళ్ళి కొద్దిమందికీ, చాలామందికీ కలసి చెప్పారు. వారంతా కలసి అందరికీ చెప్పారు. అందరూ అతన్ని పొగిడారు. మంచివాడన్నారు. మెచ్చుకున్నారు. గోపాలం నవ్వుకున్నాడు. అతను సహాయంచేసిన దాంట్లో అతని స్వార్థం ఉంది. ఆ అమ్మాయికి పెళ్ళయినట్టు అతనికి ముందుగా తెలియదు.

కాని అతని స్వార్థం ఎవరికీ కనుపించలేదు. అది అజ్ఞానంలో దాగిఉంది. అజ్ఞానం చీకటిలాంటిది. వెలుతురు ఉన్నచోట చీకటి ఉంటుంది.

జ్ఞానం ఉన్నచోట అజ్ఞానం ఉంటుంది. కాని చీకటి ఉన్నచోట వెలుతురు ఉండదు. అజ్ఞానం ఉన్నచోట జ్ఞానం ఉండదు.

అక్కడివాళ్లు తెలివిలేనివాళ్లు కాదు. కాని వాళ్ళల్లో తెలివిలేని తనం ఉంది. అందువల్ల అతను మంచివాడు. మంచివాడంటే మంచిపనులుచేసే వాడని అర్థం. మంచి ఆలోచనలు లేకపోయినా ఫరవాలేదు. చేసేపనులు మంచివి కావాలి. క్రియకూ, ఆలోచనకూ చాలా తేడా ఉంది. క్రియ ప్రత్య క్షం-ఆలోచన పరోక్షం. రెండూ ఒక్కొక్కప్పుడు కలుసుకోవు. అందు వల్ల అవి ఉత్తర దక్షిణాలు.

కాని సాధారణంగా ఆలోచనా, క్రియా రెండూ ఒకటే. రెండూ అతి సన్నిహితమైనవి. ఒకదాని ప్రక్క ఒకటి ఉంటాయి. అందువల్లఅవి తూర్పు దక్షిణాలు.

ఆలోచన, క్రియ మనసు సూచించేవి. ఆ మనసు గోపాలానిది. కనుక గోపాలం ఉత్తర దక్షిణాలు. గోపాలం తూర్పు దక్షిణాలు.గోపాలం ఉత్తరం గోపాలం తూర్పు.

అలానే గోపాలం తూర్పు పడమరలు. గోపాలం తూర్పు దక్షి ణాలు. గోపాలం పడమర. గోపాలం దక్షిణం.

గోపాలం అన్నీ. అన్నింటిలోనూ గోపాలం ఉన్నాడు. అన్నింటి లోనూ గోపాలం మనసు ఉంది. అతను ఆలోచించినట్లు చేస్తాడు. అతను ఆలోచించనట్టూ చేస్తాడు. సమయాన్నిబట్టి అతను చేస్తుంటాడు. చేసేట ప్పుడు అతను మారతాడు. ఆ మార్పు కృత్రిమం. ఆ కృత్రిమం అత నికి నచ్చదు. అందుకతను బాధపడతాడు.

ఆ బాధ శరీరానికి సంబంధించినది కాదు. మనస్సుది. అతని మనస్సు సున్నితమైనది. అది ప్రేమిస్తుంది. జాలి పడుతుంది. బాధ పడు తుంది. అంత మంచి మనసు అది. కాని ఆ మనసు చెడ్డపనులు చేయిం చింది. అతను చేశాడు. చేసినందుకు బాధ పడతాడు.

ఆ బాధను ఎవరికన్నా చెప్పుకోవాలను కుంటాడు. కాని చెప్ప లేడు. అంతా అతన్ని గౌరవిస్తున్నారు. మంచివాడను కొంటున్నారు।

వాళ్ళ అభిప్రాయం తప్పని చెప్పలేడు. చెప్తే వాళ్లు మోసపోయా మనుకుంటారు. బాధ పడతారు. వాళ్ళను బాధపెట్టడం అతనికి యిష్టం లేదు. అందువల్ల అతను చెప్పలేడు. చెప్పకుండా దాచుకుంటాడు. దాచుకుని బాధ పడతాడు. అది అతని దుర్బలత్వం. ఆ దుర్బలత్వమే అతని మంచితనం.

మంచితనం చెడు చెయ్యకపోవడం వల్ల వస్తుంది. అది దుర్బ లత్వం వల్లకూడా వస్తుంది. అలా వచ్చిన చోట కృత్రిమం ఉండాలి. అందుకని అతను కృత్రిమంగా నటిస్తున్నాడు. అలా నటించడం అంద రికీ చేతకాదు. చేతకాని పని చెయ్యడం కష్టం. కష్టమైన పని బాధ కలిగి స్తుంది. అతని దుర్బలత్వం అతనికి బాధ కలిగిస్తోంది.

కాని అతను చెడ్డపనులు చేశాడు. ఆ చెడ్డపనులు అతనికి బాధ కలిగిస్తున్నాయి. అతని మంచితనం అతనికి బాధ కలిగిస్తోంది. ఆ మంచి తనం చెడ్డపనులు చేయించింది. చేశాడు గనుక అతను బాధపడుతున్నాడు. బాధ పడుతున్నాడు గనుక అతను మంచివాడు.

కాని, తను మంచివాడు కాడని అతని అభిప్రాయం. ఆ అభిప్రా యాన్ని ఎవరూ నిజం అనరు. అంతా అతన్ని ఆదరిసారు. గౌరవిస్తారు. అవసరమైనపుడు సలహాలు తీసుకుంటారు. కల్మషం లేకుండా మాట్లాడు తారు. రహస్యాలు చెప్తారు. అంత మంచి మనుషులు వారు। వాళ్ళమధ్య అతను ఉండలేక పోతున్నాడు. వాళ్ళ మంచితనం చూసినప్పుడు ఏడుపు వస్తోంది. వాళ్ళను మోసగిస్తున్నానని బాధ కలుగుతోంది. తన యధార్థ రూపం చెప్పేయాలను కుంటున్నాడు. కాని చెప్పలేడు.

అతను నటించాలని నటించడం లేదు. నటించలేక నటిస్తున్నాడు. ఎవరూ అతన్ని అనుమానించడం లేదు అతని మంచి మనసు ఎవరినీ అనుమానించేలా చెయ్యడం లేదు.

అతనికి ఎన్నో స్వవిషయాలున్నాయి. అవి మంచితనం చేయించిన చెడ్డపనులు. అవి హృదయంలో ఉండడం లేదు. బలవంతంగా దాస్తున్నాడు. కిందకు అణుస్తున్నాడు. వాటి వత్తిడి ఎక్కువైంది. బాధ కలుగుతోంది. ఎలాగో బైట పడాలని చూస్తున్నాయవి. ఎవరితోనన్నా చెప్పుకుంటే బావుండును. కొంత భారం తీరిపోను. కాని చెప్పడానికి వీలేక పోతోంది. అతని మంచితనం చెప్పనియ్యడం లేదు. ఎదుటివారి మంచితనం చెప్పనియ్యడం లేదు. మంచితనం మంచితనాన్ని చూసి దాగు కొంటోంది!

గోపాలం అలా చూస్తున్నాడు. గోపాలం ఆలోచిస్తున్నాడు. గోపాలం అలా చూస్తూ ఆలోచిస్తున్నాడు. చూస్తున్న గోపాలం ఏమీ చూడ్డంలేదు. ఆలోచిస్తున్న గోపాలం ఏవో చూస్తున్నాడు. ఎప్పుడో చేసిన పనుల్ని చూస్తున్నాడు. ఎక్కడ కనిపిస్తున్నాయో అతనికి తెలీడం లేదు. ఎక్కడనుంచో అవి కనిపిస్తున్నాయి. సినిమాలా కదుల్తున్నాయి. ఒకదాని తర్వాత ఒకటి వస్తున్నాయి.

అందులో అతను వున్నాడు. కదుల్తున్నాడు మాట్లాడుతున్నాడు. నవ్వుతున్నాడు. తనలోని మనిషిని గోపాలం చూస్తున్నాడు. తన ఆకారాన్ని గోపాలం చూస్తున్నాడు. ఆ చేస్తున్నది తనేనా అని ఆశ్చర్య పోతున్నాడు. బాధ పడుతున్నాడు.

గోపాలం చూస్తున్న ఆకారం అబద్ధాలాడుతోంది. అమ్మాయిల్ని ప్రేమిస్తోంది. అమాయకుల్ని మోసగిస్తోంది. వేశ్యల యిళ్ళలోకి వెళ్తోంది. గోపాలం బాధపడ్డాడు. కాని ఆకారం బాధపడలేదు. నవ్వుతోంది. సంతోషంతో కదులుతోంది. గోపాలానికి కోపం వచ్చింది. ఆకారాన్ని కసురు కున్నాడు. తన్నుతాను కసురుకున్నాడు.

కసురుకున్న గోపాలం నవ్వుతున్నాడు. ఆ నవ్వు బైటకు విని పించలేదు. పెదవులుదాటి వెలుపలికి రాలేదు. పెదవులు బిగించి ఉండడం వల్ల ఆ లోపల అది ఆగిపోయింది. ఆగిపోయిన నవ్వు వెనక్కు వెళ్ళి

పోయింది. మనసులో ఒక మూల మూలిగి కూర్చుంది. ఆ మూలుగు బైటకు వచ్చింది. గోపాలం మూలిగాడు. గోపాలం నవ్వలేక మూలిగాడు.

గోపాలం ఆకారం మళ్ళీ కనిపించింది. అతను చూడగూడదనుకున్నాడు. ఆకారం మాయమయింది. అక్కడ ఏదో ఉండిపోయింది. ఆ ఉండిపోయినది చీకటిలా ఉంది. ఆ చీకటిని అతను చూస్తున్నాడు. ఆ చీకటిలోకి అతను చూస్తున్నాడు. ఆ చీకటిలోంచి అతను చూస్తున్నాడు. చీకటిలోంచి చీకటిని చూస్తున్నాడు.

చిన్న వెలుగు కనిపించింది. ఆ వెలుగు మధ్య ఒక దీపం ఉంది. ఆ దీపం దగ్గరకు గోపాలం ఆకారం వచ్చింది. గోపాలం కసురుకోలేదు. ఆకారంతో కూడా ఒకామె ఉంది. గోపాలం ఆమెను చూస్తున్నాడు. ఆమె తలలో పూలను చూస్తున్నాడు. అవి వాసన వేయడం లేదు. వాడిపోయినట్టున్నాయి. అవి వంగిపోయి భుజంమీదకు జారుతున్నాయి. భుజంమీద తెల్ల రవిక ఉంది. రవికమీద తెల్లచీర పవిట ఉంది. పవిట జారిపోయి మంచం మీద పడింది. ఆమె దీపం ఆర్పేసింది.

గోపాలం కళ్ళు మూసుకున్నాడు. చీకటి. కళ్ళు తెరిచాడు. చీకటి. చీకటిలో అతను ఉన్నాడు. అతనిలో చీకటి ఉంది. అతని మనస్సులో చీకటి ఉంది. చీకటిలో అతని మనస్సు ఉంది. గోపాలం మనసు చీకటి. గోపాలం చీకటి. తూర్పుచీకటి. పడమర చీకటి. ఉత్తరం చీకటి. దక్షిణం చీకటి. అంతా చీకటి.

అగ్గిపుల్ల మళ్ళీ వెలిగించాడు. అతని చుట్టూ వెలుతురు. ఆ వెలుతుర్లోంచి చూశాడు. వెలుతుర్లోంచి చీకటిని చూశాడు. చీకటి కనిపించింది. అగ్గిపుల్ల ఆరిపోయింది. అతని చుట్టూ చీకటి. ఆ చీకటిలోంచి చూశాడు. చీకటిలోంచి చీకటిని చూశాడు. చీకటి కనిపించింది.

అతనికి కనిపించింది ఒక్కటే. అది చీకటి. అజ్ఞానంలాంటి చీకటి. పాపం చేసిన చీకటి. ఆ చీకటిలో అతను పాపంచేశాడు. ఆ పాపం అతన్ని బాధిస్తోంది. ఆ బాధనుండి అతనికి స్వేచ్ఛ కావాలి.

కాని అతనికి స్వేచ్ఛ లభించడం లేదు. అతని మంచితనం అతనికి స్వేచ్ఛ నివ్వడం లేదు. అతన్ని కప్పేస్తోంది. అతను చేసిన చెడ్డ పనుల్ని దాచేస్తోంది. అతను చెప్పెయ్యాలనుకుంటాడు. కాని చెప్పలేడు. చెప్పుకోదగిన మిత్రులు అతనికి లేరు.

గోపాలానికి చాలామందితో స్నేహం ఉంది. ఆ స్నేహం చాలా ఉన్నతమైనది. కాని ఆ స్నేహంలో సన్నిహితత్వం లేదు. గౌరవముంది. గౌరవం ఉన్నచోట భయం ఉంటుంది. భయం ఉన్నచోట సన్నిహితత్వం ఉండదు. సన్నిహితం లేనిచోట స్వవిషయాలు రావు. అందుచేత ఎవరితోటీ చెప్పలేక పోతున్నాడు. గౌరవం ఎవ్వరితోటీ చెప్పనియ్యడం లేదు. మంచితనం ఎవరితోటీ చెప్పనియ్యడం లేదు. గౌరవం, మంచితనం— రెండూ కలసి చెప్పనియ్యడం లేదు. మంచితనంలోంచి గౌరవం వచ్చింది. దుర్బలత్వంలోంచి గౌరవం వచ్చింది. దుర్బలత్వంలోంచి భయం వచ్చింది. అందువల్ల అతను పిరికివాడు.

అక్కడి మనుషులంటే గోపాలానికి భయం. ఆ మనుషుల మంచితనం అంటే అతనికి భయం. ఆ మంచితనం తనకు తెలియగూడదనుకుంటాడు. తెలియకుండా ఉండేందుకై దూరంగా ఉండాలనుకుంటాడు. కాని వారుమాత్రం అతనికి సన్నిహితంగా వచ్చేస్తుంటారు. అతని ముందు తమ హృదయ కవాటాల్ని విప్పుతారు. ఆ కవాటాల ఆవలవాళ్ళ తెల్లకాగితంలాంటి మనసులు ఉంటాయి. వాటిమీద మరకలుండవు. మసిదాగులు కనిపించవు. స్వచ్ఛంగా మల్లెపువ్వుల్లా ఉంటాయి.

ఆ హృదయాన్ని చూస్తే అతనికి భయం. అలాంటి తెల్లరంగును చూస్తే అతనికి భయం. అందుకే అతను వెలుతుర్లో తిరగడు. పగటికి దూరంగా చీకటి గదిలో కూర్చుంటాడు. చీకటిలో తిరుగుతాడు. చీకటిలో ఆలోచిస్తుంటాడు. చీకటంటే అతని భయం లేదు. చీకటిలో కాలువ గట్టున కూర్చోవడం అలవాటు. కాని పగలు అటువైపు రాడు. వెలుతురంటే అతనికి నచ్చదు. అందుకే అతను వెలుతుర్లో తిరగడు. వెలుతురంటే అతనికి భయం.

భయంలేని వాళ్ళు సిగ్గును విడిచిపెడతారు. అంటే ధైర్యవంతులకు సిగ్గులేదు. కాని గోపాలం పిరికివాడు. అందువల్ల గోపాలానికి సిగ్గెక్కువ. సిగ్గుపడే గోపాలం సరదాగా మాట్లాడలేడు. సరదాగా తిరగలేడు. మౌనంగా ఊరుకుంటాడు. సిగ్గు మౌనంగా ఉంచుతోంది.

ఆ సిగ్గు ఆడవాళ్ళకు ఆభరణం. కాని గోపాలం మగవాడు. కనుక ఆ సిగ్గు గోపాలానికి రిస్టువాచీ. ఆ సిగ్గు గోపాలానికి నడుంమీది బెల్టు.

ఆ రెండూ అతనికి అందాన్నిస్తున్నాయి. గౌరవాన్ని కలిగిస్తున్నాయి. కాని ఆనందాన్ని యిస్తున్నట్టు లేవు. అవంటే అతనికి యిష్టం లేదు. వాటిని విడిచిపెట్టేయ్యాలనుకుంటాడు. అవి సంకెళ్లలా అనిపిస్తుంటాయి. ఆ సంకెళ్ళ నుండి అతనికి స్వేచ్ఛ కావాలి.

కాని గోపాలానికి స్వేచ్ఛలేదు. గోపాలం ఎవరితోటీ స్వేచ్ఛగా మాట్లాడలేడు. ఎవరితోటీ తన విషయాలు చెప్పుకోలేడు. సలహాలు యిమ్మని అడగలేడు. సిగ్గు అడగనివ్వదు. మంచితనం అడగనివ్వదు. గౌరవం అడగనివ్వదు.

ఆ గౌరవం లేకపోతే బావుండును. ఇష్టమొచ్చినట్టు అందరితోటీ మాట్లాడేవాడు. ఇష్టమొచ్చిన పనులు చేసేవాడు. దొంగతనంగా ఏ పనీ చెయ్యాల్సిన అవసరం లేదు. ఎవ్వరినీ మోసగించవలసిన పనిలేదు. బాహాటంగా చేసేవాడు. నలుగురికీ చెప్పి నవ్వేవాడు. కాని అతనికి గౌరవం ఉంది. అందువల్ల అతను దురదృష్టవంతుడు.

గోపాలం దురదృష్టవంతుడు. ఆ విషయం అతనికి ఆ ఉదయమే తెలిసింది. ఉదయం మామూలుగా సుమతివచ్చింది. సుమతి అతని స్నేహితుని చెల్లెలు అతని దగ్గర పాఠాలు చెప్పించుకుంటోంది. అతను చెప్తాడు. కాస్సేపు కూర్చోబెట్టి కబుర్లాడి పంపిస్తుంటాడు. ఆమె అంటే అతనికి అభిమానం, ప్రేమ. ఆ ప్రేమ అతని హృదయంలో ఉండిపోయింది. బైటకు రాలేదు. రావాలని చూస్తోంది. మంచిరోజు దగ్గర్లోలేదు. ఉంటే వచ్చిఉండేది!

ఆ అమ్మాయి వచ్చి అతని సహాయం కావాలంది. అతను ఆ అమ్మాయిని ప్రేమించాడు. అందువల్ల వెంటనే చేస్తానన్నాడు. ఆ అమ్మాయి చెప్పింది. తాను స్కూల్లో లెక్కల మాష్టారుని ప్రేమించిందట. అతనుకూడా ప్రేమించాడట. పెళ్ళి చేసుకుంటాడట. ఆ విషయం వాళ్ళ అన్నయ్యతో చెప్పమంది. ఎలా అయినా వాళ్ళ అన్నయ్యను ఒప్పించమంది.

ఈ సహాయం గోపాలం ఆ అమ్మాయికి చెయ్యాలి. గోపాలం చెయ్యననలేదు. చేస్తానన్నాడు. గోపాలం అంటే ఆమెకు గౌరవం. అతను మంచివాడని ఆమె అభిప్రాయం. అతని మనసులోని ఆలోచనలు ఆమె తెలుసుకోలేదు. అతనిమీద నమ్మకంతో తన స్వవిషయాలు చెప్పుకొంది.

ఆ సంఘటన అతనికి బాధకలిగించింది. ఆ అమ్మాయి అతన్ని ప్రేమించలేదు. అందుకతను బాధపడలేదు. ఆ అమ్మాయి అతన్ని మంచి వాడనుకొంటోంది. అందుకతను బాధపడ్డాడు. తనలోని చెడు ఊహల్ని చూసి బాధపడ్డాడు. ఆమె ఆ వూహల్ని గుర్తించనందుకు బాధపడ్డాడు.

అతను ప్రతిదానికీ బాధపడతాడు. చాలా సున్నిత హృదయం. యితరులు బాధపడడం సహించలేడు. వాళ్ల బాధపడకుండా ఉండేందుకు అతను ఏం చెయ్యాలో ఆలోచిస్తున్నాడు.

దూరంగా చిన్న వెలుగు కనిపించింది. లేచి దగ్గరకు వెళ్ళాడు. చెట్టు తొర్రలో గుడ్లగూబ తొంగిచూస్తోంది. అతను చప్పుడు చేశాడు. అది పారిపోయింది. మరో చెట్టు తొర్రలోకి వెళ్ళి నిద్రపోయింది.

గోపాలం అక్కడనుండి బయలుదేరాడు. కాలవగట్టు వెంబడే నడిచాడు. పరుగెత్తాడు, కొత్త మనుషులమధ్యకు పరుగెత్తి పారిపో యాడు.

గోపాలం పారిపోయాడు.

***